ప్రత్యేక పూజలు



ఆలయాన్ని సందర్శించిన ఎండోమెంట్ ప్రధాన స్థపతి

గౌలిపురా: పటేల్‌నగర్‌లోని రేణుకాఎల్లమ్మ ఆలయాన్ని శనివారం ఎండోమెంట్ ప్రధాన స్థపతి సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన ఆలయ అభివృద్ధికి సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో దాత అల్లం శ్రీనివాస్, దేవాలయ కమిటీ చైర్మన్ సాకెల్లి సర్వేశ్ కుమార్, అధ్యక్షులు కాలే శ్రీనివాస్, పటేల్ నగర్ కాలనీ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్, ఆలయ అర్చకులు విష్ణు చారి, గణపతి, కమిటీ సభ్యులు శివానంద్, నవీన్, రాజు, సునీల్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రమావైద్యనాథన్ ప్రదర్శనలు



గోల్కొండ: ప్రఖ్యాత భరత నాట్య కళాకారిణి రమావైద్యనాథన్ నృత్యాలకు గోల్కొండ కోట వేదికగా నిలిచింది. పరంపర నృత్య రూపకల్లో భాగంగా శనివారం గోల్కొండ కోట చరిత్ర, సంస్కృతి, భక్తి, కళలను మేళవించి ప్రదర్శించిన రమావైద్యనాథన్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. 90 నిమిషాల పాటు జరిగిన ఈ నిమగ్న నృత్య రూపకంలో గురుస్తోత్రం, కామాక్షి, కాశీ, రఘువీరా, ప్రసలీలా అనే ఐదు ప్రత్యేక అంశాలతో రమావైద్యనాథన్ ఆమె సహచర నాట్య కత్తెలు అబ్బురపరిచారు.

శంకర్‌రావుకు సన్మానం



అబిడ్స్: వాణిజ్య పన్నుల శాఖలో 30 ఏళ్లకు పైగా సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన డి.శంకర్‌రావును శనివారం మెహిదీపట్నం సర్కిల్ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ..30 ఏళ్లకు పైగా విజయవంతంగా విధులు నిర్వహించేందుకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

సమాజ సేవకే జీవితం అంకితం




రఘునందన్‌యాదవ్‌ను సత్కరిస్తున్న నీలేందర్ యాదవ్, పైడి సంతోష్ నాయుడు

అఫ్జల్‌గంజ్: సమాజ సేవకే జీవితం అంకితమని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రఘునందన్ యాదవ్ పేర్కొన్నారు. తరచు సమాజ సేవలు చేస్తూ సమాజ సంక్షేమం కోసం నిర్విరామంగా కృషి చేస్తానన్నారు. శనివారం బేగంబజార్‌లోని తన కార్యాలయంలో స్థానిక నాయకులు నీలేందర్ యాదవ్, పైడి సంతోష్ నాయుడు ఆయనను ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో రఘునందన్‌యాదవ్ మాట్లాడుతూ..సమాజ సేవలోనే ఎంతో ఆనందం తృప్తి ఉంటుందన్నారు.

సామూహిక ప్రార్థనలకు

మక్కా మసీదు ముస్తాబు



సామూహిక ప్రార్థనల కోసం మక్కా మసీదు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టెంట్



చార్మినార్‌లో మొదలైన రంజాన్ మార్కెట్ సందడి

చార్మినార్: ఆకాశంలో నెలవంక కనిపించడంతో ఆదివారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభంకానున్నాయి. శనివారం రాత్రి రుహతే హిలాల్ కమిటీ నుంచి ప్రకటన వెలువడిన వెంటనే ముస్లింలు ఒకరినొకరు రంజాన్ మాసం ప్రారంభం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. రంజాన్ మాసంలో జరిగి సామూహిక ప్రార్థనల కోసం మక్కా మసీదులో ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేశారు. మండే ఎండల నుంచి ఉపశమనం కోసం మక్కా మసీదు ప్రాంగణంలో టెంట్ వేసి జానిమాజ్‌లు ఏర్పాటు చేశారు. ఆదివారం తెల్లవారు జామున 5.11 గంటలకు సహెర్‌తో రంజాన్ మాసంలోని మొదటి ఉపవాస దీక్షను ముస్లింలు ప్రారంభించనున్నారు. అలాగే ఆదివారం సాయంత్రం 6.28 గంటలకు ఉపవాసం విరమించి ఇఫ్తార్ విందులో పాల్గొననున్నారు. శనివారం రాత్రి మక్కా మసీదులో తరావీ ప్రార్థనలతో రంజాన్ మాసం సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడింది. ఇక చార్మినార్ పరిసరాల్లో నెల రోజుల పాటు కొనసాగే రంజాన్ మార్కెట్ సందడి శనివారం సాయంత్రం నుంచి మొదలైంది. అన్ని రకాల చిరువ్యాపారాలు అధిక సంఖ్యలో కొలువుదీరాయి.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి అన్నారు. మగ్దూంపురా శివ పార్వతీ ఫంక్షన్ హాల్ వద్ద శనివారం రూ.3.10 లక్షల నిధులతో నూతన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ భాగ్యలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..బస్తీలో రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీంతో జీహెచ్ఎంసీ ద్వారా రూ.3.10 లక్షల నిధులను మంజూరు చేయించి అభివృద్ధి పనులను ప్రారంభించాన్నారు. ఈ కార్యక్రమంలో గౌలిపురా ఏఈ తేజోవంత్, గౌలిపురా డివిజన్ అధ్యక్షుడు ఇ.సుమన్‌కుమార్ ముదిరాజ్, బీజేపీ నాయకులు జి.రఘుకాంత్, జమాల్‌పూర్ అశోక్, కె.రాజ్ కుమార్, బస్తీవాసులు కె.మహేశ్ రావు, ఎ.రాజ్ కుమార్, రాఘవేంద్ర రాజు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జియాగూడ: జియాగూడ భారత అభ్యుదయ ఉన్నత పాఠశాలలో 1997–98 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని పాఠశాల వ్యవస్థాపక ట్రస్ట్ సభ్యుడు కమల్ ప్రసాద్, ప్రిన్సిపాల్ దేవేందర్, మాజీ ప్రిన్సిపల్ గిరిజా కుమారి, ఉపాధ్యాయులు సరస్వతి దేవి చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు 26 ఏళ్ల తర్వాత కలిసి ఒకరిని ఒకరు పలకరింపులతో ఆహ్లాదంగా గడిపారు. పూర్వ విద్యార్థులు సి.రవీందర్, అర్చన, నరేందర్, సంతోష్, శ్రీధర్, ఉదయ్ ప్రకాష్, కుమార్, వెంకటేష్, సుకుమార్ రెడ్డి, సోనీ పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి



చాంద్రాయణగుట్ట: చక్కటి ఆరోగ్యం కోసం ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని నేషనల్ రైట్స్ మూమెంట్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జాతీయ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ మహ్మద్ సాహిల్ ఖాన్ సూచించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫలక్‌నుమా వట్టెపల్లిలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అసోసియేషన్ తెలంగాణ విభాగం చైర్మన్ మహ్మద్ షాబుద్దీన్‌తో కలిసి శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గెలాక్సీ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సయ్యద్ ఖలీముద్దీన్, డాక్టర్ అసద్, డాక్టర్ అస్మా రోగులకు బీపీ, షుగర్, విష జ్వరాల పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ టీమ్ గవర్నర్ ఇష్రత్ ఫాతీమా, ప్రతినిధులు నాగేశ్వరీ, వెంకటేష్, మక్బూద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మజ్లిస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



బంజారా దర్వాజ వద్ద మజ్లిస్ పార్టీ పతాకావిష్కరణలో ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: మజ్లిస్ పార్టీకి అన్ని వర్గాల ప్రజల ఆదరణ రోజురోజుకూ పెరుగుతుందని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. మజ్లిస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన గోల్కొండ, కార్వాన్, లంగర్‌హౌస్, నానల్ నగర్ తదితర ప్రాంతాల్లో పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ సెక్యూలర్ విధానాలకు కట్టుబడి ఉందని అందువల్లే తమ పార్టీకి అన్ని వర్గాల ప్రజల నుంచి భారీ మద్దతు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆరూస్‌ఫరాన్, అజీజ్‌ఖాన్ పటాన్, ఖదీర్, అమీన్‌పాషా తదితరులున్నారు.

ఖతీబ్, ఇమామ్‌ల నియామకం

శాలిబండ: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మక్కా మసీదులో తరావీ ప్రార్థనల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఖతీబ్, ఇమామ్‌లను నియమించామని మక్కా మసీదు సూపరింటెండెంట్ మహ్మద్ సిద్దిఖ్ తెలిపారు. రంజాన్ నెలలో 10 రోజుల చొప్పున మొత్తం 30 రోజుల పాటు ప్రతిరోజూ తరావీలో మూడు పారాలు చదవడం జరుగుతుందన్నారు. 1వ దహా 1వ రోజు నుంచి 9వ రోజు వరకు మక్కా మసీదు ఖతీబ్ హాఫీజ్ హ్మద్ రిజ్వాన్ ఖురేషి ప్రతిరోజూ మూడు పారాల చొప్పున మొత్తం 10 రోజుల ఖురాన్ పఠనం చేయిస్తారన్నారు. 2వ దహా 10వ రోజు నుంచి 19వ రోజు వరకు మక్కా మసీదు ఇమామ్ హాఫీజ్ మహ్మద్ లతీఫ్ అహ్మద్ 10 రోజుల ఖురాన్ పఠనం చేయిస్తారన్నారు. 3వ దహా 20వ రోజు నుంచి 29వ రోజు వరకు మక్కా మసీదు ఇమామ్ హాఫీజ్ మహ్మద్ అబ్దుల్ అలీ 10 రోజుల పాటు మూడు పారాల చొప్పున ఖురాన్ పఠనం చేయిస్తారన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



గోల్కొండ: మెహిదీపట్నంలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ఫెయిర్‌వెల్ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. కాలేజీ అమ్మాయిలు ర్యాంప్ వాక్‌తో సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సిస్టర్ విజయరాణి మాట్లాడుతూ..భారతీయ సంస్కృతి సంప్రదాయలకు మరే విదేశీ సంస్కృతి సాటిరాదని తమ విద్యార్థినులు నిరూపించారన్నారు. ర్యాంప్ వాక్‌లో మిస్ అనైట్ విన్నర్, రన్నర్‌ల పేర్లను ప్రకటించారు. 2024–25 సంవత్సరానికి రాబియా అమ్జత్ మిస్ అన్నైట్‌గా నిలిచారు. అదే విధంగా అదీబా ఫస్ట్ రన్నరప్‌గా, మలిహా సెకండ్ రన్నరప్‌గా నిలిచారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

గన్‌ఫౌండ్రీ: ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో ప్రజా ఉద్యమాలు కీలకపాత్ర పోషిస్తాయని పలువురు వక్తలు అన్నారు. శనివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఆల్ ఇండియా కన్వెన్షన్ ఆఫ్ ది నేషనల్ అలియన్స్ ఆఫ్ పీపుల్స్ మూవ్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యాన్ని విశదీకరించు–రాజ్యాంగ న్యాయం నుంచి వాతావరణ న్యాయం వరకు అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ..నేడు ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సవాళ్లను తెలియజేయాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. పౌర సమాజం కొత్త యుద్ధ సరిహద్దు అని 2021లో జాతీయ భద్రత సలహాదారులు అజిత్ దోవల్ చేసిన వ్యాఖ్యలను ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజిక కార్యకర్త మేధా పాట్కర్, ప్రముఖ పర్యావరణవేత్త సోనం వాంగ్‌చుంగ్, బేలా భాటియా, అరుణ్‌రాయ్, ప్రశాంత్ భూషణ్, ప్రొఫెసర్ శాంతా సిన్హా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పటిష్టతకు కృషి చేయాలి

గోల్కొండ: కార్వాన్ డివిజన్‌లో బీజేపీ పటిష్టతకు కృషి చేయాలని బీజేపీ కార్వాన్ డివిజన్ అధ్యక్షుడు ఉద్దడి జగదీష్‌కుమార్ అన్నారు. డివిజన్‌కు నూతనంగా నియమితులైన కమిటీ సభ్యుల సమావేశం శనివారం కార్వాన్‌లోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు ఉద్దడి జగదీష్ కుమార్ మాట్లాడుతూ..కార్వాన్ డివిజన్‌లో బీజేపీని మరింత బలీయమైన శక్తిగా తీర్చిదిద్దేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింగ్ రావు, కంటెస్టెడ్ కార్పొరేటర కట్ల అశోక్, గిరిధర్, గంజి రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.



‘మాతృమూర్తులతోనే మాతృభాష బతుకుతుంది’



గన్‌ఫౌండ్రీ: మాతృమూర్తులతోనే మాతృభాష బతుకుతుందని తెలంగాణ ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ సి.పార్థసారథి అన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అక్షరయాన్, సీతాస్, చారిటబుల్ ట్రస్ట్, అవిగ్నభారతి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న మహిళా రచయిత్రుల జాతీయ సదస్సును ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాటి తరం రచయిత్రుల నుంచి నేటి తరం రచయిత్రుల వరకు వారి జీవన ప్రస్తావాలను తెలిపేలా ప్రతిభను తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం మహిళా రచయిత్రుల పత్ర సమర్పణలను ఆవిష్కరించారు. అదేవిధంగా పలువురు మహిళా రచయిత్రులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంగీత నాటక అకాడమి మాజీ చైర్మన్ దీపికారెడ్డి, పలువురు మహిళా రచయిత్రులు, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరుల సంస్మరణ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న పిడమర్తి రవి తదితరులు

గన్‌ఫౌండ్రీ: మాదిగ అమరవీరులపై మందకృష్ణ మాదిగకు ప్రేమ ఉంటే లక్ష డప్పులు వేల గొంతుల కార్యక్రమానికి వచ్చిన డప్పులను అమరవీరుల కుటుంబాలకు ఇవ్వాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. శనివారం మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మాదిగ సంఘాల ఐకాస ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి అబిడ్స్‌లోని పొన్నాల సురేందర్ మాదిగ విగ్రహం వరకు మాదిగ అమరవీరుల సంస్మరణ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ..తెలంగాణలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వసూలు చేసిన కోట్ల రూపాయాల డప్పులను మాదిగ అమరవీరుల కుటుంబాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ మీసాల మల్లేశం, రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఎన్.నర్సింహా మాదిగ, బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బొరెల్లి సురేష్, టీబీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మెర స్టాలిన్ పాల్గొన్నారు.

‘సనాతన ధర్మం’ గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి

నాంపల్లి: యువ కళావాహిని ఆధ్వర్యంలో రాచకొండ మల్లికార్జునరావు రచించిన ‘సనాతన ధర్మం’ గ్రంథావిష్కరణ సభ శనివారం మాసబ్‌ట్యాంక్ నఫీజ్ రెసిడెన్సీలోని గాయత్రీ సదనంలో జరిగింది. ముఖ్యఅతిథిగా డాక్టర్ కేవీ రమణాచారి హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ గ్రంథాన్ని చిత్తశుద్ధి, భావావేశంతో రచయిత రాచకొండ మల్లికార్జునరావు అక్షర రూపం చేయగలిగారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం, విశ్రాంత ప్రధానోపాధ్యాయిని శ్రీధర ప్రభావతి, సినీ రచయిత డాక్టర్ పి.రాజేంద్రకుమార్, జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుదిబండి వెంకటరెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ రాచకొండ శేషాద్రి, యువ కళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

‘కిషన్‌రెడ్డిపై సీఎం వ్యాఖ్యలు సరైనవి కావు’

చార్మినార్: రాష్ట్ర అభివృద్ధికికేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎన్నో రకాలుగా కృషి చేస్తున్నప్పటికీ..సీఎం రేవంత్ రెడ్డి ఆయనపై ఆరోపణలు చేయడం సరైనది కాదని బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు టి.ఉమామహేంద్ర అన్నారు. హైదరాబాద్ నగరంలో మెట్రో రైలు ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తున్న కిషన్ రెడ్డి కృషిని సీఎం రేవంత్ రెడ్డి తప్పుగా ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. అంతేకాకుండా మూసీ సుందరీ కరణ ప్రాజెక్టు కోసం కూడా ఆయన పాత్ర ఎంతో ఉందన్నారు. ఇక బీసీల సంక్షేమం కోసం ముందు నుంచి పనిచేస్తోంది కిషన్ రెడ్డి మాత్రమేనన్నారు. ఇలా రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని తప్పుపట్టడం సీఎం రేవంత్ రెడ్డికి తగదన్నారు. ఇప్పటికైనా ఆయన కిషన్ రెడ్డిపై చేసిన ఆరోపణలను ఉప సంహరించుకోవాలని ఉమామహేంద్ర డిమాండ్ చేశారు.

ఆస్తిపన్ను చెల్లించని వారి ఆస్తులు సీజ్



అబిడ్స్: ఆస్తిపన్ను చెల్లించని వారి ఆస్తులను జీహెచ్ఎంసీ 14వ అబిడ్స్ సర్కిల్ అధికారులు సీజ్ చేస్తున్నారు. శనివారం అబిడ్స్ ప్రాంతంలోని ట్విన్ సిటీస్ టవర్‌ను జీహెచ్ఎంసీ 14 సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి.లావణ్య, ఏఎంసీ శైలజ, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ కైలాష్ సింగ్, బిల్ కలెక్టర్ సంజీవ్ కుమారు సీజ్ చేశారు. రూ.25 లక్షలు బకాయి ఉండి చెల్లించకపోవడంతో జీహెచ్ఎంసీ అధికారులు రెడ్ నోటీసులు జారీ చేసి చివరకు శనివారం ఆ కాంప్లెక్స్ మొత్తానికి తాళాలు వేశారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులు లావణ్య, శైలజ మాట్లాడుతూ..కఠినంగా వ్యవహరిస్తున్నట్లు హెచ్చరించారు.

మహారాణా ప్రతాప్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న గోపీనాథ్ రెడ్డి, శంకర్ యాదవ్, సురేందర్‌సింగ్ తదితరులు

జియాగూడ: మహారాణా ప్రతాప్ మొఘల్ సామ్రాజ్యాన్ని ధిక్కరించి శౌర్య ప్రతాపాలతో పోరాడి చరిత్రలో నిలిచాడని మాజీ డీజీపీ గోపీనాథ్‌రెడ్డి అన్నారు. బేగంబజార్, భూలక్ష్మీ టెంపుల్, మహారాణా ప్రతాప్ చౌక్ వద్ద మహారాణా ప్రతాప్ జాగృతి మంచ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఠాకూర్ సురేందర్ సింగ్ ఆధ్వర్యంలో శ్రీ వీర్ శిరోమణి మహారాణా ప్రతాప్ రాజ్యాభిషేక్ వేడుకలను పురస్కరించుకొని నూతనంగా మహా ఖడ్గాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మాజీ డీజీపీ గోపీనాథ్ రెడ్డి, కార్పొరేటర్లు జి.శంకర్‌యాదవ్, లాల్ సింగ్, నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్, పలు సమాజ్‌ల ప్రతినిధులు మహారాణా ప్రతాప్ భారీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నర్సింగ్ ఠాకూర్, నంది కిషోర్‌సింగ్, సచిన్‌రాజ్ సింగ్, హృదయానాథ్ సింగ్, గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షులు ఉమా మహేందర్, బీఆర్ఎస్ శాంతి దేవి, మహేందర్, నితిన్ నంద్కర్ పాల్గొన్నారు.

డిజిటల్ సాంకేతికతపై అవగాహన పెంపొందించుకోవాలి



సదస్సులో వివిధ విభాగాలకు చెందిన నిపుణులు

గన్‌ఫౌండ్రీ: డిజిటల్ సాంకేతికతపై అవగాహన పెంపొందించుకోవాలని గ్లోబల్ చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ సుజీర్ నాయర్ అన్నారు. కింగ్‌కోఠిలోని సెయింట్ జోసెఫ్ డీగ్రీ, పీజీ కళాశాలలో డిజిటల్ యుగాన్ని ఆలింగనం చేసుకోవడం..వ్యాపారాలను మార్చడం..స్థితి స్థాపకంగా ఉండే పర్యావరణ వ్యవస్థలను నిర్మించడం కోసం వ్యూహం అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా గ్లోబల్ చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ సుజీర్ నాయర్ మాట్లాడుతూ..డిజిటల్ ఇన్నోవేషన్ ద్వారా వ్యాపారాల భవిష్యత్తును రూపొందించడంలో సహకార ప్రయత్నాల పాత్రను తెలిపారు. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక పర్యావరణ వ్యవస్థలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా ప్రొఫెసర్ వై.జహంగీర్, ఇనాట్యాక్ట్ హైదరాబాద్ కన్వీనర్ అనురాధ రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ కె.మారెడ్డి, ప్రిన్సిపాల్ ఆంథోని సగరాజ, సెమినార్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి క్రికెట్ టోర్నమెంట్



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ సేవకుడు రాకేశ్ తివారీ, ప్రతినిధులు

గౌలిపురా: బలరాం గోపాల్, మేకల రాజ్ కుమార్ స్మారకార్థం ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు మేకలమండిలోని ఓంకార్ ప్లే గ్రౌండ్ 2వ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఓంకార్ యూత్ అసోసియేషన్, మాతా మాణికేశ్వరి యూత్ అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించే ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనదలచిన జట్టులకు ఎంట్రీ ఫీజు రూ.1000లు ఉంటుందన్నారు. విన్నర్స్ జట్టుకు రూ.10 వేలు, రన్నరప్ జట్టుకు రూ.5 వేలు ప్రదానం ఉంటుందన్నారు. క్రికెట్ టోర్నమెంట్ సందర్భంగా రూపొందించిన వాల్ పోస్టర్‌ను శనివారం సంఘ సేవకుడు రాకేశ్, విజ్ఞాన్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పుల్లా రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రత్నం, అజయ్, జి.ఎం.జ్యోతి కుమార్, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన సైన్స్ ఫెయిర్



జియాగూడ కాకతీయ స్కూల్‌లో..



ప్రదర్శనను తిలకిస్తున్న మెజిస్ట్రేట్ షా ఆలాం జావీద్ తదితరులు



సైన్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న డిప్యూటీ ఈఓబీ వెంకటేశ్వర్లు తదితరులు



సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్‌లో..

గోల్కొండ: మెహిదీపట్నంలోని శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం సైన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా గోల్కొండ, ఆసిఫ్‌నగర్ జోన్ డిప్యూటీ డీఈఓ రమణ రాజు, నాంపల్లి డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథులుగా హాజరై విద్యార్థుల ప్రదర్శనలు తిలకించారు. మెహిదీపట్నం జోన్ ఏజీఎం కృష్ణ, ప్రిన్సిపాల్ స్వాతి, డీన్ మల్లేష్‌యాదవ్, ఇన్‌చార్జీలు నదీమ్, బాలరాజు, మురళీకృష్ణ, రవి షగుఫ్తా కో ఆర్డినేటర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

జియాగూడలో..

జియాగూడ: జియాగూడ కాకతీయ స్కూల్ ప్రిన్సిపాల్ వికాస్‌చంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యురేఖ సైన్స్ ఫెయిర్‌కు ఛత్రపతి శివాజీ మహరాజ్ మరాఠా మండల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మండన్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఇన్‌ఛార్జ్ ప్రసన్నలత, వందన, స్నేహ పాల్గొన్నారు.

ఆసిఫ్‌నగర్ నారాయణ ఈ టెక్నో పాఠశాలలో..

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ నారాయణ ఈ టెక్నో పాఠశాలలో శనివారం అకాడమిక్ ఫెయిర్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్సీ కోర్ట్ మెజిస్ట్రేట్ షా ఆలాం జావీద్, మల్లారెడ్డి హెల్త్ సిటీ అకాడమిక్ డైరెక్టర్ కె.సుధారమణ హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. విద్యావేత్తలు శ్రీనివాస్, చంద్రశేఖర్, రష్మిక, ఫర్హానా, ప్రిన్సిపల్ శశికళ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సరస్వతి విద్యానికేతన్‌లో..

అఫ్జల్‌గంజ్: సైన్స్ ఎగ్జిబిషన్ ద్వారా విద్యార్థుల సృజనాత్మక శక్తికి దోహదపడతాయని ఆసిఫ్‌నగర్ డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారి రమణరాజు, నగర ట్రస్మా సలహాదారులు గాలయ్య అన్నారు. శనివారం జియాగూడ సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ బాలరాజ్ కౌలే, ప్రిన్సిపాల్ సునేత్ర కౌలే ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. నర్సింగ్‌రావు, మహేశ్వరి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.